కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మల్లాపూర్: నాచారంలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో సాయినేత్రాలయం, స్పార్‌కిల్స్ డెంటల్ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన కంటి, డెంటల్ వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మేడ్చల్ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రాగిరి మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఉచితంగా ఏర్పాటు చేసే వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీనియర్ సిటిజన్స్ ప్రధాన కార్యదర్శి సాయిబాబా, ఉపాధ్యక్షుడు నాగేశ్వర్, కార్యదర్శి శ్రీశైలం, జాయింట్ సెక్రటరీ జగన్నాథం, ఎల్లేష్, యాదగిరి, సావిత్రి, సువర్ణ, స్థానికనేతలు శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్, కిషోర్, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు ముందడుగు !

- చెత్త రహిత ప్రాంతంగా బోడుప్పల్ కార్పొరేషన్
- పారిశుద్ధ్యంపై ప్రత్యేక స్పెషల్ డ్రైవ్
- సహకరించాలంటున్న అధికారులు





శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న కమిషనర్ శైలజ, బోడుప్పల్‌లో ఏర్పాటు చేసిన నిఘా కెమెరాలు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థను చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు పూర్తి స్థాయి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీనిలో భాగంగా వినూత్న రీతిలో కొన్ని ప్రదేశాల్లో ఆధారిత సీసీటీవీ కెమెరాలు, ఆటోమేటెడ్ వాయిస్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. ఇవి ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ఎవరైనా చెత్త వేస్తే అనౌన్స్‌మెంట్ ద్వారా ముందుగా రికార్డు చేసిన వాయిస్ ప్రకటనలు హెచ్చరికలను జారీ చేస్తుంది. దీంతో చెత్త వేసేవారిపై జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్‌లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పరిశుభ్రత, ఆరోగ్యం గురించి ప్రజలకు ప్రత్యేక అవగాహన సదస్సుల ద్వారా వివరించనున్నారు.

చెత్త వేస్తే నిఘా కెమెరాలకు చిక్కినట్లే...

బహిరంగ ప్రదేశాల్లో ఇక వేస్తే నిఘా సీసీ కెమెరాలకు చిక్కుతారు. దీనికోసం వినూత్న రీతిలో కొన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. 7వ డివిజన్ పరిధిలోని శివాలయం రోడ్డు, 21వ డివిజన్ పరిధిలో అయ్యప్పస్వామి ఆలయం, బంగారు మైసమ్మ దేవాలయం నుంచి చెంగిచర్ల రోడ్డు వరకు ఈ నిఘాను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా చెత్త వేసే వారిని పట్టుకుని చట్టపరమైన చర్యలతోపాటు జరిమానా విధిస్తారు.

సీసీ కెమెరాలు పనిచేసే తీరు..

ఆటోమేటిక్ వాయిస్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్‌ల ద్వారా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే సమయంలో ముందుగా రికార్డు చేయబడిన వాయిస్ ప్రకటనలు హెచ్చరికలను జారీ చేస్తాయి. ఇలా గుర్తించిన వాహనాలు, వ్యక్తులపై జరిమానా విధించడంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నారు.

స్పెషల్ డ్రైవ్..

నగర పాలక సంస్థను పరిశుభ్రతతో పాటు ప్రజలను ఆరోగ్యవంతంగా ఉండేందుకు ప్రత్యేక శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ప్రతి డివిజన్‌లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ.. ఎలాంటి అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేలా తగిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి వ్యర్థాల వల్ల కలిగే నష్టాలు, అనారోగ్య సమస్యలు గురించి వివరించేందుకు సిద్ధమవుతున్నారు.

ఇంటింటి నుంచి చెత్త సేకరణ..

◆ ఇంటి యజమానుల నుంచే తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి సేకరించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు.

◆ పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఇల్లు, దుకాణాల నుంచి వ్యర్థాలను సేకరించాలి.

◆ తడి చెత్త, పొడి చెత్తను ఇంటి యజమానుల నుంచి వేరు చేయించి స్వచ్ఛ ఆటోలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలి.

◆ తడి చెత్త నుంచి వచ్చే ఆహార పదార్థాలు, కూరగాయల ముక్కలు, పండ్ల తొక్కలు, ఆకులు, వాడిన పూలు, కొబ్బరి బోండాలతో కంపోస్టు ఎరువులు తయారు చేసేందుకు కృషి చేయాలి.

◆ పొడి చెత్త నుంచి వచ్చే చిత్తు కాగితాలు, అట్టలు, న్యూస్‌పేపర్లు, ప్లాస్టిక్ కవర్లు, క్యారీ బ్యాగ్‌లు, పెప్సీబాటిల్, ప్లాస్టింగ్ పేపర్లు, సోప్ కవర్లు, ఆయిల్ ప్యాకెట్లు, సీసాలు, రబ్బరు చెప్పులు, విరిగిన ప్లాస్టిక్ బొమ్మలను రీ సైక్లింగ్‌కు తరలించాలి.

> **సైన్ బోర్డులను ఏర్పాటు చేశాం..**
>
> శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బంది నిరంతరం నగర పాలక సంస్థ పరిశుభ్రంగా ఉండేందుకు కృషి చేస్తున్నారు. చెత్త వేసే ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో పాటు సైన్ బోర్డులను ఏర్పాటు చేశాం. మనమంతా ఆరోగ్యవంతమైన జీవితం గడిపేందుకు కృషి చేద్దాం.
>
> – శైలజ, బోడుప్పల్ కమిషనర్

కాప్రా తహసీల్దార్‌గా బైరెడ్డి రాజేష్

కాప్రా: మండల తాహసీల్దార్‌గా బైరెడ్డి రాజేష్‌కు బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సుచరిత మూడుచింతపల్లి మండలానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న బైరెడ్డి రాజేష్‌ను డిప్యుటేషన్‌పై కాప్రా మండల తహసీల్దార్ బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ భూములను గుర్తించి తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావడమే కాకుండా వాటికి గూగుల్ మ్యాపింగ్ చేసి, పకడ్బందీగా చర్యలు చేపట్టారు. విధి నిర్వహణలో కాప్రా మండల ప్రజల మన్ననలు పొందారు.

దీపావళి కొనుగోళ్ల సందడి



మల్లిఖార్జుననగర్ గ్రౌండ్ ఏర్పాటు చేసిన టపాసుల దుకాణం

గౌతంనగర్: దీపావళి సందర్భంగా మల్కాజిగిరి సర్కిల్‌తో పాటు గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రధాన అంతర్గత మార్గాలలో మార్కెట్లు కిటకిటలాడాయి. దీపావళి ప్రతిమలు, టపాసులు కొనడానికి ప్రజలు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. ఎటుచూసినా దీపావళి సందడి నెలకొంది.

మహనీయుల ఆశయసాధనకు కృషి చేయాలి

మల్లాపూర్: నాచారం ఎర్రకుంటలో మహనీయులు డాక్టర్ బీఆర్. అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలదండ కార్యక్రమం ఆదివారంతో 254 వారానికి చేరింది. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి వారి ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. లోయాక స్వామి, చిలుక శంకర్, జంగం అశోక్, గద్ద క్రాంతి కిషోర్, ఐలేని మహేష్, వెంకటేష్ తదితరులున్నారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు



అల్వాల్: దీపావళి సందర్భంగా అల్వాల్‌కు చెందిన తోట సుజాతరెడ్డి తన నివాసంలో బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విశేషంగా ఆకర్షిస్తున్న బొమ్మల కొలువు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాటు చేశారు.

కార్మికుల హక్కుల పరిరక్షణకు సీఐటీయూ కృషి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాసులు

కీసర: కార్మికుల హక్కుల పరిరక్షణకు సీఐటీయూ కృషి చేస్తుందని రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసులు అన్నారు. కీసర మండలం సీఐటీయూ తొలి మహాసభలు దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని ప్రణాయ్ సాయిగ్రాండ్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం హామీ ఇచ్చిన వేతన సవరణలు, పీఎఫ్, ఈఎస్ఐ అమలులో విఫలమైందన్నారు. సీఐటీయూ కార్మికుల పక్షాన నిలిచి హక్కుల సాధనకు నిరంతరం పోరాడుతుందన్నారు. ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్, ఐద్వా మేడ్చల్ జిల్లా నాయకులు వినోద, సీఐటీయూ నాయకులు, బంగారు నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏకగ్రీవం..

సీఐటీయూ కీసర మండలం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా బంగారు నర్సింగ్‌రావు, సభ్యులుగా చింతకింది అశోక్, వెంకటేష్, కృష్ణ, అశ్విని, రాములమ్మ, జంగయ్య, స్వామి, జాన్‌మోషా, లలిత, మోహన్, రోశప్ప, వెంకట్, వెంకటేష్, రాణి, నీరజ, జయమ్మ, లావణ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో జ్ఞానమాల

కీసర: అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో కీసరలో జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర జ్ఞాన ప్రచార వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లబాబు హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొమ్ము సుదర్శన్, తుడుం శ్రీనివాస్, అంబేడ్కర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గురుకుల్ పరిరక్షణ సమితి ఏర్పాటు



ఘట్‌కేసర్: స్థానిక గురుకుల్ పాఠశాల, జూనియర్ కళాశాలను కాపాడాలని పూర్వ విద్యార్థులు సురేష్‌యాదవ్, మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుకుల్ విద్యాసంస్థ పరిరక్షణ సమితిని ఎన్నుకున్నారు. గురుకుల్ స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని, పాఠశాల, జూనియర్ కళాశాల యధావిధిగా నడిపించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గురుకుల్ విద్యాసంస్థలు దేవాదాయధర్మాదాయశాఖ నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని తీర్మానించారు.

హెచ్చరిక బేఖాతరు !



చెక్‌పోస్టు వద్ద వ్యర్థాలు ఇలా..

మేడ్చల్: చెత్తవేయడానికి ప్రజలకు ఏ ప్రాంతం అనర్హం కానట్టుగా మేడ్చల్ మున్సిపాలిటీ తయారైంది. కాలనీలలో ఇళ్ల మధ్య వివిధ ప్రాంతాలకు వెళ్లే రహదారి పక్కన వ్యర్థాలను ఇష్టానుసారంగా పారవేస్తున్నారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా మరింత చెత్త వీధుల్లో కనిపిస్తుంది.

ఎక్కడపడితే అక్కడ చెత్త..

ఒకప్పుడు మేడ్చల్ మున్సిపాలిటీ స్వచ్ఛతలో అగ్రస్థానంలో ఉండేది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దక్షిణ భారతదేశంలో చిన్నపట్టణాల జాబితాలో మేడ్చల్ మున్సిపాలిటీ అగ్రస్థానంలో నిలిచి, దేశస్థాయిలో అవార్డు పొందింది.

◆ నేడు మేడ్చల్ మాత్రం అవార్డు అందుకున్న నాటి పరిస్థితులకు భిన్నంగా మారింది. పట్టణంలో ఏ వార్డు చూసినా.. చెత్తమయంగా కనబడుతోంది. పట్టణంలోని 23 వార్డుల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. విలీన గ్రామాలు అత్వెల్లి, కిష్టాపూర్, రాయిలాపూర్, పూడూర్‌లలో చెత్త సమస్యను పట్టించుకునే వారె లేకుండా పోయారు.

జరిమానాలు విధిస్తున్నా..

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసిన వారికి మున్సిపాలిటీ అధికారులు జరిమానాలు విధిస్తూ.. బహిరంగ ప్రదేశాలను గుర్తించి అక్కడ చెత్త వేయకూడదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా పరిస్థితిలో మార్పు రావడం లేదు. బోర్డులు ఉన్న పక్కనే చెత్త వేస్తున్నారు.

పటిష్టం చేయాలి..

పారిశుద్ధ్యం, పరిశుభ్రత చూసే మున్సిపల్ శానిటరీ విభాగం మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది. కార్మికులు ఎప్పటికప్పుడు చెత్తను తరలించే పద్ధతులలో మార్పు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రస్తుతం వార్డులలో వార్డు ఆఫీసర్లు, జవాన్లు పరిశుభ్రత కోసం పనిచేస్తున్నా.. మరింతగా పనిచేయాల్సిన అవసరం ఉంది. ఇళ్ల నుంచి చెత్త సేకరణకు పేయిడ్ పద్ధతి ఉండటంతో పరిస్థితి బాగానే ఉన్నా రోడ్లపై చెత్తను ఊడ్చి పక్కనే నిల్వ ఉంచి 2–3 రోజులకోకసారి తొలగిస్తుండటంతో రోడ్డు పక్కన పరిసరాలు కంపుకొడుతున్నాయి.

మార్కెట్‌లో దీపావళి సందడి



బాణాసంచా దుకాణంలో కొనుగోళ్లు

ఘట్‌కేసర్: మార్కెట్‌లో దీపావళి సందడి మొదలైంది. దీపావళి పర్వదినం పూజలకు పెట్టింది పేరు. మున్సిపాలిటీ ప్రజలే కాకుండా సరిహద్దు గ్రామాల ప్రజలు పట్టణానికి చేరుకోవడంతో దుకాణాల్లో సందడి నెలకొంది. పూలు, మిఠాయి దుకాణాలు బాణాసంచా, ప్రమిదల దుకాణాలు కిటకిటలాడాయి.

◆ అంబేడ్కర్ చౌరస్తా, బస్ టెర్మినల్ ఎదురుగా మెయిన్ రోడ్డు, ఎదులాబాద్ రోడ్డులో పెద్దఎత్తున బాణాసంచా, పూలు, ప్రమిదలు, గుమ్మడి కాయల దుకాణాలు ఏర్పాటు చేశారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవోదయనగర్ కమాన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: రాజకీయాలకతీతంగా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీ కాలనీ డివిజన్, నవోదయనగర్ కాలనీ ముఖ ద్వార ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలందరి సహకారంతో ఉప్పల్ నియోజకవర్గంను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. మాజీ కార్పొరేటర్లు శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, కాంగ్రెస్, బీజేపీల డివిజన్ అధ్యక్షుడు పోలేపాక అంజయ్య, మునుగంటి రాంప్రదీప్, తాళ్లపల్లి లింగం, జైపాల్, జమాలయ్య, అశోక్, నాగరాజు, భాగ్యమ్మ, జ్యోతి తదితరులున్నారు.

ప్రతి ఇంట ఆనంద దివ్వెలు వెలగాలి

కాప్రా: దీపావళి పర్వదినంలో ప్రతి ఇంట ఆనంద దివ్వెలు వెలగాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. ఈ దీపావళి పండుగ దుష్టశిక్షణ, శిష్ట రక్షణకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. జగత్తును జాగృతం చేసే చైతన్య దీప్తుల శోభావళిగా దీపావళి నిలుస్తుందన్నారు. ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం, సకల శుభాలు కలగాలని కోరుకుంటున్నానని, దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



కీసర: కీసర అహ్మద్‌గూడలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో తెలంగాణ రాష్ట్రస్థాయి డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల డైరెక్టర్ సుశీల్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీలత హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 16 విద్యా సంస్థల నుంచి విద్యార్థులు హాజరై వారి ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



అల్వాల్: సత్యసాయిబాబా శతజయంత్యోత్సవాల సందర్భంగా అల్వాల్‌లోని సత్యసాయి కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసపత్రాలు అందజేశారు. తెలంగాణ రాష్ట్ర సత్యసాయిసేవా సంస్థల అధ్యక్షుడు వెంకటరావు, ప్రధాన పదాధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కృషితోనే మెరుగైన సమాజం



ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేస్తున్న ఎంఈఓ రామారావు

ఉప్పల్: ఉప్పల్ మండల ట్రిస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాల వేడుక ఉప్పల్‌లోని ప్రైవేట్ హోటల్‌లో ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి రామారావు హాజరై మాట్లాడుతూ.. ఉప్యాధ్యాయుల నిరంతరం కృషితోనే మెరుగైన సమాజం ఏర్పడుతుందన్నారు. 150 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలను ఒమేగా గ్రూప్ చైర్మన్ నాగం మోహన్‌రెడ్డితో కలిసి అందజేశారు. అనంతరం ట్రిస్మా మండల అధ్యక్షుడు బాణాల విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేట్ స్కూళ్లలో పనిచేసే ఉపాధ్యాయులకు ట్రిస్మా అండగా ఉంటుందన్నారు.

కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న కాలనీవాసులు

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, ఇందిరానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా బీవీ. నర్సింహ్మారెడ్డి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కాటిపల్లి శివారెడ్డి, ఉపాధ్యక్షుడిగా వెంకటకృష్ణారెడ్డి, రమణనాయక్, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.వెంకట్రావు, వెంకటేష్, కోశాధికారిగా అన్నిబోయిన వెంకటేష్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సీసీఎస్ ప్రతినిధులు వారిని అభినందించి ఘనంగా సత్కరించారు. అందరి సహకారంతో కాలనీని అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. ఎంపల్లి పద్మారెడ్డి, మొగిలి రాఘవరెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

బోడుప్పల్: అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని అంబేడ్కర్ ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు నత్తి మైసయ్య పిలుపునిచ్చారు. బోడుప్పల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి 348 జ్ఞానమాలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన రాజకీయ రిజర్వేషన్లు ఉండాలన్నారు. 68 శాతానికి పైగా బీసీలున్నా.. రిజర్వేషన్ లేక రాజకీయంగా వెనుకబడి ఉన్నారన్నారు. ప్రభుత్వాలు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికల్లోకి వెళ్లాలని డిమాండ్ చేశారు. బంగారు మైసమ్మ దేవాలయం చైర్మన్ బొబ్బల లక్ష్మారెడ్డి, మాజీ వార్డు సభ్యులు బొమ్మక్ రమేష్, మాజీ ఎంపీటీసీ సభ్యులు వీరాచారి, నేతలు నర్సింగ్‌రావుగుప్తా, సంజీవ్, యాకయ్య, శివ, యేసురాజు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత రిమాండ్



నిందితుడు రాజు

మల్లాపూర్: గంజాయి విక్రేతను నాచారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాచారం కార్తీకేయనగర్ శ్మశానవాటికలో గంజాయి విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు నాచారం పోలీసులు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నాచారం ఇండియన్‌గ్యాస్ డిస్టిబ్యూటర్‌గా పనిచేస్తున్న బిలోలు రాజు అలియాస్ భానుచందర్(35)ను విచారించగా.. చత్తీస్‌గడ్, రాయపూర్ ప్రాంతానికి చెందిన ధనుష్ అనే వ్యక్తి నుంచి 5 కిలోల గంజాయిని రాజు, సాయి కిరణ్, దయాకర్‌లు కలిసి కొనుగోలు చేశారు. 4 కిలోల గంజాయిని వాడుకుని మిగిలిన 1 కేజీని శనివారం రాత్రి విక్రయించేందుకు యత్నించగా.. పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద ఉన్న 1188 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

దీపావళి టపాసుల పంపిణీ



టపాసులు పంపిణీ చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

అల్వాల్: దీపావళి పండుగ సందర్భంగా యాప్రాల్ లక్ష్మీనారాయణ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం పేదపిల్లలకు దీపావళి టపాసులు పంపిణీ చేశారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు, కార్పొరేటర్ మీనాఉపేందర్‌రెడ్డిలు హాజరై టపాసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకోవాలన్నారు. ఆర్కే శ్రీనివాస్, భానుప్రకాష్, ఆదిత్య, నవీన్, వినయ్, నాగరాజు, బుజ్జి, ధనలక్ష్మి, సత్యనారాయణ తదితరులున్నారు.